పిచ్చి

బరువుతో బుజాన్ని దిగలాగుతున్న పుస్తకాల సంచీని తీసి అలమార్లో పెట్టాడు వెంకట్రమణ. వెనకదొడ్లో నాలుగురోజులనాడు పుట్టిన తువ్వాయి గంతులేస్తూ కనిపించింది. పెద్ద నల్లటి కళ్ళతో తెల్లగా ముద్దుగా వున్న తువ్వాయిని చూడగానే వుత్సాహంగా లోపలికి వెళ్ళబోయాడు. వంటగదిలో నుండీ మాటలు వినవచ్చాయి. సుందరమ్మమ్మతో పాపమ్మత్త మాట్లాడుతున్నది. రెండు మాటలు చెవిన పడగానే ముందుకు వెళ్ళబోతున్న వాడు కాస్తా ఆగి గోడ దగ్గరకు వెళ్లాడు.

"ఇప్పుడు కాస్త నయంగానే వున్నట్లుంది పిల్లాడు బాగున్నాడా అనడిగింది. కాసేపు బాగానేమాట్లాడింది. తరువాత నా నగలు పోయాయి అంటూ ఏడిచింది. మామూలేగా... అయినా ఆ తిట్లు అవీ లేవులే ఇప్పుడు... పిల్లాణ్ణి చూపిస్తే కాస్త మనుషుల్లో పడుతుందేమో..." పాపమ్మత్త అంటోంది.

"ఏమి నయమో! పదేళ్ళనాటి పిచ్చి ఇప్పుడు ఒదుల్తుందన్న ఆశ నాకు లేదు పాపమ్మా... ఏం పాపం చేసుకున్నామోగాని శుభమా అంటూ వున్న ఒక్కడికీ పెళ్ళి చేస్తే కర్మకొద్దీ ఆ రాక్షసిముండ దొరికింది. ఎట్లాగో దాని పీడ వొదిలిపోయిందనుకో. ఈ దమయంతిని తెచ్చి చేస్తే దీని సంగతి యిట్లా అయిపోయింది. ఇదంతా కర్మకాకపోతే ఏమిటంటావు! బాలెంతకి పథ్యమూ పాడూ కుదరక పైత్యం చేస్తే మాత్రం తిరుగులేని పిచ్చిపట్టిపోవాలని వుందా..." అన్నది సుందరమ్మమ్మ.

"అయిపోయిన దానికి ఏం చేస్తాం? కాని ఇప్పటిమాటా ఆలోచించు... పిల్లాణ్ణి చూపిస్తే కాస్త గుణమిస్తుందేమో. అది బాగుపడి యింటికొచ్చే ఉపాయం చూడాలిగాని రెండు పెళ్ళిళ్ళు యిట్లా కుమ్మరాంలయిపోయినాక మూడో పెళ్ళి చెయ్యలేవు గదా. యిప్పటికి అంతా బాగానే జరిగిపోతూ వుందనుకో. ఎప్పటికెట్లా వుంటుందో. ఒక్కదానివీ ఎన్నాళ్ళని తిప్పలు పడతావు?..." పాపమ్మత్త వాదిస్తోంది.

వెంకట్రమణ యిహ వినటం మానేసి తిరిగి ముందు హాల్లోకి వెళ్ళి కుర్చీలో కూర్చున్నాడు. అనాలోచితంగా చిన్నబల్లమీదున్న పెన్నుని రెండువేళ్లతో గిరగిరా

తిప్పటం ప్రారంభించాడు. గుండ్రంగా ఆకర్షణీయంగా వున్న మొహమ్మీదికి పడుతోంది చిందరవందరగా రేగిన జుట్టు. విశాలమైన నల్లటి కళ్ళు నిరాసక్తంగా పెన్నును చూస్తున్నాయి. ఇట్లాంటి పనుల్నే 'చేతులూరుకోని నాశనప్పనులు' అంటుంది సుందరమ్మమ్మ.

కాస్సేపున్నాక పాపమ్మని పంపించటానికి ముందుగదిలోకి వచ్చింది సుందరమ్మ. రమణని చూసి "ఎప్పుడొచ్చావురా, పిలవకపొయ్యావా... వుండు, పాలు పిండి కాచి తెస్తాను... ఆ పెన్నెందుకురా అట్లా తిప్పుతావూ, కిందపడితే పాడవదూ" అంటూ వుండగానే పెన్ను గచ్చుమీద పడింది. రమణ దాన్ని యథాస్థానంలో పెట్టాడు.

"చెబుతావుండగానే పడేస్తివిగదరా... ఒఠ్ఠి నాశనపు పనులు! మీ నాన్నొస్తే చావగొడతాడు... ఆ పుస్తకాలు తీసి చదవనన్నా చదువు" అంటూ పెన్ను తీసుకుని లోపలికి వెళ్ళిపోయిందామె.

వెంకట్రమణ కాళ్ళు చిన్న బల్లమీద పెట్టి వూపుకుంటూ కూర్చున్నాడు. సుందరమ్మమ్మ వూరికే అట్లా అంటుందిగాని తండ్రి రామయ్య తనను వాయగొట్టడని రమణకి తెలుసు. అంతేగాకుండా యివాళ చదవబుద్ధి వెయ్యటం లేదు. బడినుంచీ రాగానే మళ్ళీ చదువేమిటి?

"మెడ్రాసు పిచ్చాసుపత్రికి నన్ను తీసుకుపోయి చూపిస్తారా! పిచ్చాసుపత్రినిండా పిచ్చాళ్ళుంటారు కాబోలు" అనుకున్నాడు వెంకట్రమణ. వాడికి వెళ్ళాలనిగాని, వెళ్ళకూడదనిగాని ఏ అభిప్రాయమూ లేదు. ఆవిడ... అమ్మ... ఆ మనిషి ఎట్లా వుంటుందో, జుట్టంతా జడలుకట్టిపోయి చింపిరిగుడ్డలు వేసుకొని వుంటుందేమో అనుకున్నాడు. రమణకి భయమూ అసహ్యమూ కలిగాయి. 'ఎవరో ఆ పిచ్చిది! నాకేమి సంబంధం! నేనెప్పుడూ చూడనుకూడా లేదు' అనుకున్నాడు.

బళ్ళో చేరిన కొత్తలో పాపమ్మత్త కొడుకు నారాయుడు క్లాసు పిల్లలతో "వీళ్ళమ్మ పిచ్చిది" అని చెప్పాడు. పిల్లలందరూ నవ్వారు. రమణకి చాలా నామోషీ అనిపించింది.

"కాదు..." అని అరిచాడు కోపంగా.

"మీ అమ్మ మెడ్రాసు పిచ్చాసుపత్రిలో వుంది" అన్నాడు వాడు.

"మా అమ్మ సుందరమ్మమ్మ పిచ్చిది కాదు" అంటూ వాణ్ణి చెంపమీద ఈడ్చికొట్టాడు. వాడికి నోట్లోంచీ రక్తం కారింది. వాడు రక్తం తుడుచుకొంటూ ఏడుస్తూనే

"సుందరమ్మ నీ అవ్వలే, లేకపోతే అమ్మా అనకుండా సుందరమ్మమ్మా అంటావెందుకు? మా అమ్మతో చెప్తానుండు" అంటూ వెళ్ళిపోయాడు. తరువాత సంగతి విని సుందరమ్మమ్మ రమణని ఎత్తుకొని ముద్దాడి "వాడి మొహం, ఆ నారాయుడి కేమీ తెలీదులే" అన్నది. అప్పటినుండి పిచ్చివాళ్ళమీద రమణకి ద్వేషం కలిగింది. ఒకనాడు

బడినుంచి వస్తూ చెట్టుకిందవుండే పిచ్చిదానిమీద రాయివేశాడు కూడా... ఇదంతా ఒకటోక్లాసులో వున్నప్పటి సంగతి. ఇప్పుడు తన తల్లి పిచ్చాసుపత్రిలో వున్నదని రమణకు తెలుసు. ఆవిణ్ణి ఎప్పుడూ చూడలేదు. ఆవిణ్ని గురించిన ఆలోచనలు కూడా రావు. ఇవాళ పాపమ్మత్త మాటలు విన్నాక 'ఎట్లా వుంటుందో' అనుకున్నాడు. ఆవిణ్ణి 'అమ్మ' అని ఎప్పుడూ అనుకోడు రమణ. ఆ మనిషి అనుకోడానికీ వీల్లేకుండా ఉంది. ఎప్పుడైనా ఆవిణ్ణి గురించి అనుకున్నప్పుడు ఆ స్థానం ఖాళీగా ఒదిలేస్తాడు.

'ఆవిడ'ంటే సదభిప్రాయం మాత్రం లేదు రమణకి. వుంటే కొంచెం కోపం, జుగుప్స వుండాలి.

ఒకసారి 'ఆవిడ' నాన్న- సుబ్బయ్య తాత- వచ్చాడు. మెద్రాసు వెళ్ళి వచ్చాడట. సన్నగా, ముసలిగా, ఒంగిపోయి వున్నాడు. జుట్టు సగం నలుపూ, సగం తెలుపూగా దారాల్లా వున్నది. మాటకి ముందు పళ్ళు చూపిస్తాడు. కోతి ఇకిలించినట్టుగా. అట్లా ఇకిలిస్తే ఎదుటివాళ్ళు సంతోషిస్తారనుకుంటాడేమో! అడుక్కునేవాడిలాగా వున్నాడు. ఆ మాట చెప్పడానికి వచ్చినవాడు మధ్యాహ్నం అన్నం తిని సాయంత్రం కాఫీ త్రాగి రాత్రి అన్నం తిని మరీ వెళ్ళాడు.

తండ్రి రామయ్య అతనితో అసలు మాట్లాడలేదు. సుందరమ్మమ్మ మర్యాదకి కాసేపు వూకొట్టి వెళ్ళిపోయింది. వూరికే కూర్చుండి ఏమీ తోచక రమణని పలకరించాడు.

"పిప్పరమెంటు బిళ్ళలు కొనుక్కొని తింటావా?' అన్నాడు.

రమణకు అర్థం కాలేదు. 'రెండు పైసలిస్తాను, కొనుక్కుంటావా' అనో 'వీళ్ళు నీకు అట్లాంటివి కొనిస్తారా' అనో 'వుంటే నాకూ రెండు పెట్టు' అనో - ఏమిటో తెలియలేదు. ఆ పలకరింపు అసహ్యం కలిగించి సమాధానం చెప్పకుండా లేచి వెళ్ళిపోయాడు. ఈ సుబ్బయ్య తాత పెళ్ళాం వూరందరికీ తెలుసు. 'నల్లచ్చమ్మ' అంటారు. బడికి వెళ్తుంటే ఎప్పుడన్నా కనబడుతుంది.

బొగ్గు నలుపులో సన్నగా ఎండుకుపోయి వుంటుంది. జుట్టు నల్లగా మెరుస్తూ వుంటుంది. దాన్ని నిమ్మకాయ ప్రమాణంలో తమాషాగా ముడివేస్తుంది. ఎప్పుడు చూసినా రోడ్డుమధ్యన నిలబడి వూరంతటికీ వినబడేట్లు ఎవరితోనైనా యుద్ధంచేస్తూ వుంటుంది. మధ్యలో జుట్టుముడి వూడదీసి విదిలించి మళ్ళీ గట్టిగా నిమ్మకాయ ఆకారంలో వేస్తూ, అరుస్తూ వుంటుంది. బడిపిల్లలందరితోపాటు రమణకూడా 'నల్లచ్చమ్మ' అని చెప్పి నవ్వుతాడు. తాను పిచ్చిదవటమే కాకుండా యిట్లాంటి యింటికి చెందివుండటం కూడా 'ఆవిడ' గురించిన రమణ అసంతృప్తికి కారణమైంది. వాళ్ళంతా ఒట్టి పిచ్చిపాడు గుంపు! అనుకున్నాడు.

ఎవరైనా వూళ్ళోవాళ్ళు మెద్రాసు వెళ్లినప్పుడు చచ్చిన కాలేజి, జూ, లైట్‌హౌస్,

యల్ఐసీ బిల్డింగులతోపాటుగా పిచ్చాసుపత్రిలో 'దమయంతి'ని కూడా చూసివస్తారు. అప్పటి సంభాషణల్లో రమణకు కొన్ని కొన్ని విషయాలు వినబడతై. తన తండ్రికి మొదటి భార్య పురిపోసుకు చచ్చిందట. అప్పుడు యీమెనిచ్చి చేశారట. ఈ పెళ్ళికాక ముందు నల్లచ్చమ్మ దగ్గర తిట్లూ దెబ్బలూ తింటూ గొడ్డుచాకిరీ చేసేదట. 'కొంప ఎట్లాంటిదైతేనేం? తామరపువ్వు బురదలో పుట్టదా? పిల్ల పనీ చేస్తుంది. అణకువా వున్నది' అని సుందరమ్మమ్మ ఆలోచించి ఈ పెళ్ళి చేసిందట. మొదట్లో చెప్పినపని చేసుకుపోతూ తిరుగు చెప్పకుండా బాగానే వుండేదట. పిల్లాడు పుట్టనిచ్చి బుద్ధి మారిపోయిందట.

"కాన్పుకు తీసుకువెళ్ళినవాళ్ళు బాలెంతకు అపథ్యం చేసి, పైత్యం ఎక్కిపోయింది" అన్నది సుందరమ్మమ్మ.

"నెల దాటకుండానే తీసుకొచ్చాము, అప్పటికే పైత్యం ఎక్కుతూ వుంది గావాలు, నాకేం తెలుసు! పిల్లాణ్ణి దించకుండా ఎప్పుడూ కోతి కరుచుకున్నట్టు కరుచుకొని వుండేది. పథ్యం సరిగా చెయ్యకుండా అదీ యిదీ తినేవాళ్ళు పాలిస్తే పిల్లాడు ఎక్కిరాడు, ఆవుపాలు పోద్దాంలే అన్నాను. అంతలోనే పిల్లాడికి విరేచనాలు రానే ఒచ్చినై. ఇక యిది మాటవినదూ అని అలవాటు తప్పించటానికి పిల్లాణ్ణి రెండురోజులు కిష్టాయి యింటికి పంపించేశాను. అప్పటికే పైత్యం ఎక్కింది. రెండు రోజులపాటు మునగదీసుకు పడుకుంది. ఒకటే ఏడుపు. ఒక్కపనీ ముట్టుకోలేదు. తిండీ తినలేదు. పోనీలే అని వూరుకున్నాను. తిండి లేక పైత్యం మరీ ఎక్కువైపోయింది. మూడోనాడు లేచి 'నా పిల్లలందర్నీ నువ్వే చంపేశావు, దొంగముండా' అంటూ నన్ను గట్టిగా పట్టేసింది. నలుగురూ పోగై పట్టు విడిపించి దాన్ని తాళ్ళతో కట్టేసేసరికి తలప్రాణం తోకకొచ్చింది. అప్పుడే ఒంటిమీద నగలుకూడా తీసేశారు. ఆ ఏం నగలులే-బొట్టుగొలుసూ, రెండు గాజులూను! అంతే పిల్లలసంగతి ఒదిలేసి నగలో అని పట్టుకుంది. ఒక్క తిట్టుకాదులే. నానా తిట్లూ మొదలెట్టింది. అంత అణకువగా వుండేది, ఇట్లా తిరిగిపోయిందంటే... ఆ పిచ్చి పిచ్చి యిహ అంతే అయిపోయింది. మంత్రాలూ, నాటుమందులూ అన్నీ చూసి యిహ లాభంలేదని మెడ్రాసులో వేశాము..." ఒకసారి మూడో క్లాసు టీచరమ్మతో యీ కథంతా చెప్పింది సుందరమ్మమ్మ.

"పాలు యివ్వనీయలేదనే యింత గొడవా జరిగిందా! పోనీ పిల్లాణ్ణి వెనక్కి తెచ్చి చూపారా?" టీచరమ్మ అడిగింది.

"అయ్యో రాత! పిల్లాణ్ణి గొంతు పిసికేస్తే ఏంగాను! నెలబిడ్డాయెను" అన్నది సుందరమ్మమ్మ.

"అవున్లెండి. అదీ నిజమే" అన్నది టీచరమ్మ.

తననిగురించి వాళ్ళు యిలా మాట్లాడుకోవడం రమణకు నచ్చలేదు.

"నాన్న పొలం వెళ్ళాలని నిన్ను తొందరగా రమ్మన్నాడుగా సుందరమ్మమ్మా" అన్నాడు.

ఇదిగో వెళ్తున్నా అంటూనే-

"ఈ కాలంలో పిల్లలికి పాలు ఎవరిస్తున్నారమ్మా, మరీ లేనివాళ్ళు తప్ప! అందం పోతుంది, ఆరోగ్యం పోతుంది అంటూ అందరూ డబ్బాపాలే పోస్తున్నారుగా. పిచ్చికాకపోతే దానికోసం ఎవరన్నా ఏడుస్తారా! పిల్లాడు తాగటం లేదుకదా, పాలు గోడమీదికి పిండేసెయ్యవే అన్నాను. అదేమి ఏడుపోగాని ఒకటే కుమిలి కుమిలి ఏడవటం! అందరూ సినిమాలు చూసి నేర్చుకుంటున్నారమ్మా యీ ఏడుపులూ, నవ్వులూ, డాన్సులూ, పాటలూను. అదే సర్దుకుంటుందిలే అనుకున్నాను. అంతలోనే పైత్యం ముంచుకొచ్చింది..." ఏమిటేమిటో చెప్పుకొచ్చింది సుందరమ్మమ్మ.

సాధారణంగా యీ విషయాలన్నీ తనముందు మాట్లాడదు ఆమె. ఇవన్నీ అప్పుడప్పుడు రమణ విన్న విషయాలు. అర్థం కాకపోయినా మనసు అనే స్టోరుగదిలో నిలిచిపోయిన విషయాలు...

ఎగ్జిబిషన్ చూసి, మర్నాడు పిచ్చాసుపత్రికి వెళ్ళారు సుందరమ్మా, రామయ్యా, రమణా. మెడ్రాసు ప్రయాణం మొదలుపెట్టిన దగ్గర్నుండి రమణ ఆలోచనలు వుండుండీ ఆవిడమీదికే వెళ్ళేవి. ఇన్నాళ్ళు పిచ్చిదిగా సంబంధంలేని మనిషిగా వున్న ఆవిడ, ఆలోచనల్లో దగ్గరికి వచ్చి ఏదో అస్పష్టమైన సంబంధం వెలికి రాసాగింది. చెట్టుకింద పిచ్చిది జ్ఞాపకం వచ్చి భయం కలిగింది. ఆత్రుతతో 'అట్లా వుండకూడదు' అనుకున్నాడు.

దమయంతి శుభ్రంగానే వున్నది. తల దువ్వుకొన్నది. చీర మాసినా చిరుగులు లేవు. సుందరమ్మమ్మని చూడగానే కోపంగా-

"ఒచ్చావూ... నా నగలన్నీ తెచ్చావా లేదా పిశాచీ" అన్నది.

రమణ సుందరమ్మమ్మ వెనకాతల నిల్చుని ఆసక్తితో చూస్తున్నాడు. దమయంతి రమణని చూసింది. నుదురు చిట్లించి ఆలోచిస్తూ "ఈ పిల్లాడెవరూ" అన్నది. ఎవరూ మాట్లాడలేదు. "ఇట్లారా అబ్బాయ్" అన్నది. రమణ వెళ్లకుండా చెయ్యి పట్టుకు ఆపింది సుందరమ్మమ్మ.

"నీ పేరు వెంకట్రమణ కాదూ! పాపమ్మ చెప్పిందిలే. నీవు నా కొడుకువేరా... ఒరే పిలిస్తే రావూ! నేను నీ అమ్మనిరా... ఒరే, ఒక్కమాట చెబుతా, గుర్తుపెట్టుకో. లోకం నిండా ఆడవాళ్ళున్నా, నేనేరా నీ అమ్మని. నిజంగా నీవు నా కడుపులోనే పెరిగావురా. అప్పుడు నా కడుపుమీద చెయ్యిపెట్టుకు చూసుకుంటే లోపల నువ్వున్నావురా. నేను

చూస్తూవుంటే నీవు యీపక్క నించీ ఆ పక్కకి తిరగటం కనుపించిందిరా... నిజంగా... సత్యప్రమాణంగా!... అందుకే నేను చెప్పేది ఏమంటే నీవు నీ అమ్మ రుణం తీర్చుకోవాలి. ఆ పిశాచి దగ్గర నా నగలున్నాయి ఎప్పటికైనా తెచ్చి యివ్వాలి. తెలిసిందా..." ఆత్రుతగా అన్నది. ఆశగా చూసింది.

ఆ మాటలు వింటుంటే రమణకి భయం వేసింది. భయంలోనే మనసు 'అమ్మ' అన్న పదం పలికింది. సుందరమ్మమ్మ యిహ పోదాం అని తొందర పెట్టింది. వస్తూవుంటే వెనకనుంచీ దమయంతి అరుస్తూనే వున్నది.

"నా నగలన్నీ తెచ్చివ్వాలిరా... నేనేరా నీ అమ్మని" అంటూ.

బయటికొచ్చాక రమణ మెల్లగా అడిగాడు.

"సుందరమ్మమ్మా, అమ్మకి పిచ్చి నయమయిందా?" అని.

సుందరమ్మ విసుగ్గా కోపంగా "అమ్మెవ్వర్రా, నీ బొంద! ఆ పాపమ్మ మాటలు నమ్మి తీసుకొచ్చానుగాని దీనిపిచ్చి తగ్గేదికాదు! ఆ వరసన పిచ్చికేకలు పెడుతుంటే యింకేం తగ్గుతుంది!... హవ్వ! చిన్నపిల్లాడి ముందర ఏం మాటలు!" అన్నది.

'ఆమె నగలు యీ సుందరమ్మమ్మ యివ్వనే యివ్వదు... పాపం!'

అనుకున్నాడు రమణ.

★★★